# ఒకమొక్క ఇద్దరు తోటమాలులు

— రోషన్

రా[illegible] పన్నెండింటికి వచ్చింది. అంతవరకు కిటికీ [illegible] బరువుగా. [illegible] ఇందిర [illegible] వచ్చింది.

[illegible] ముసుకుని నిద్రపోతున్నాడు రాజా.

వెళ్లి పక్కనే కూర్చొని, వాడి తల మీద చెయ్యి వేసి ప్రేమగా నిమిరింది.

నిద్రలోనే తల్లికి ఇంకా దగ్గరగా జరిగి, రాజా చెయ్యి మీద వేసి, తల్లి గుండెల్లో తల దూర్చుకున్నాడు రాజా నెమ్మదిగా.

రాజా శరీరం చుట్టూ చేతులు వేసి ఇంకా దగ్గరకు తీసుకుంది ఇందిర. ఆ అనుభూతిలో ఎన్ని బాధలు ఉన్నా సునాయాసంగా మరిచిపోగలదు.

ఏవో ఆలోచిస్తూ మాగన్నుగా నిద్ర పోయిన ఇందిర, తలుపు చప్పుడయ్యేసరికి ఉలిక్కిపడి లేచి కూర్చుంది.

అప్రయత్నంగానే కళ్లు గడియారాన్ని చూశాయి. పదకొండున్నరకు ఇంకా అయిదు నిమిషాలు ఉంది.

గబగబా వెళ్లి తలుపు తెరిచింది ఇందిర.

''ఆలస్యం అయిపోయిందేం?'' అడుగ కూడదని తెలిసినా అడగకుండా ఉండలేక పోయింది.

''ఆఫీసులో పని ఉంది.'' నిర్లక్ష్యంగా జవాబు చెప్పి పైకి వెళ్లబోయాడు నారాయణ.

''భోజనం ...''

''తినేసే వచ్చాను.'' పైకి పోయి గది తలుపులు మూసుకున్నాడు నారాయణ.

మూసుకున్న తలుపుల వైపు ఓక్షణం చూసి, వచ్చి మళ్లీ రాజా పక్కలో పడుకుంది ఇందిర.

* * *

తెల్లవారిపోయింది.

పెళ్లయినప్పటినుండి నిద్రలేకుండానే తెల్లారిపోయిన రాత్రులు ఎన్నో. లెక్క పెట్టుకునేంత ఓపిక లేదు ఇందిరకు.

ఇంట్లో ఏ రోజు, ఏ క్షణంలో తుఫాను లేస్తుందో కూడా చెప్పలేదు. ముందుముందు ఆ తుఫాను తాకిడికి తట్టుకోలేకపోయేది. కాని, రానురాను అలవాటయిపోయింది.

ఆకాశం మబ్బుతో నిండుకొని ఉందేమో సూర్యభగవానుడి దర్శనం ఇంకా కాలేదు.

తాపీగా వంటింట్లో పని చేసుకు పోతూంది ఇందిర.

''అమ్మా! నాకు టిఫిన్ సర్దెయ్యి'' అంటూ వచ్చాడు రాజా.

''అరె! అప్పుడే టైమ్ అయిందా? ఒక్క క్షణం. [illegible] ఒక్కటే ఉంది. పుస్తకాలు సర్దుకొంటూ ఉండు. నేను టిఫిన్ సర్దేస్తాను.''

టిఫిన్ సర్దుతూ ఉంటే ఖంగుమని వినిపించింది:

''స్నానానికి నీళ్లు తోడావా?''

ఉలిక్కిపడి ఇటు తిరిగింది ఇందిర — ''మీరా ఇప్పుడే లేచేశారా?'' అంటూ.

మరో జవాబుకోసం నిలవకుండానే బాత్‌రూమ్‌లోకి పరిగెత్తి, నీళ్లు తోడి వచ్చింది.

నారాయణ వచ్చేలోపల భోజనానికి సిద్ధంగా ఉండాలి. ఆఫీసుకి వెళ్లితే మూడ్ బాగుంటే ఇంటికి తిరిగి వచ్చేందుకు మామూలు టైమ్ అరున్నర. లేకపోతే పదకొండు తరవాతే.

ఇంకా చారు పెట్టాలి.

నారాయణ స్నానం పది నిమిషాల్లో అయిపోతుంది.

గబగబా తాలింపు వేసి, చారు కాచేసింది ఇందిర.

ఇంతలో బాత్‌రూమ్ తలుపులు తెరుచుకున్నాయి.

క్షణంలో పీట వేసి, కంచం పెట్టింది.

నారాయణకు దగ్గరుండి తన చేతులారా వడ్డించే అలవాటును ఏనాడో మానుకుంది.

కూరల గిన్నెలు, అన్నం వడ్డించిన పళ్లెం దగ్గర పెట్టింది.

నారాయణ వచ్చి కూర్చున్నాడు.

నారాయణ భోజనం అయ్యాక మెల్లగా డబ్బులు అడగాలనుకుంది ఇందిర. రాజా ఆ ముందు రాత్రే ఏదో నోటుపుస్తకం కావాలన్నాడు. ఇంట్లో డబ్బులు కూడా నిండుకున్నాయి. ఆ ఇంట్లో ఏది ఏమయినా రాజా చదువు సునాయాసంగా, ఏ ఆటంకం లేకుండా జరిగిపోవాలి.

ఆలోచిస్తూ ఆ పక్కనే నిలుచున్న ఇందిర ధడాలున ఏదో శబ్దం అయ్యేసరికి అటు తిరిగింది.

అన్నమున్న కంచంతోబాటు, చారు గిన్నెను కూడా పెరట్లో గచ్చుమీద విసురుగా వడేసి వస్తున్నాడు నారాయణ.

ఇందిర కాళ్లు వణికాయి.

ఎదురుగా వస్తున్న నారాయణ ఆవేశం ఇందిర చెంపమీద బలంగా ఓ దెబ్బ పడేంత వరకు తగ్గలేదు.

''వెధవది. ఈ ఇంట్లో కడుపు నిండుకు నాలుగు మెతుకులు కూడా దొరకవు. ఛ!'' విసురుగా వెళ్లిపోయాడు నారాయణ.

తలుపుచాటున నిలబడి ఇదంతా చూస్తున్న రాజా, తండ్రి వెళ్లిపోగానే హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

అలాంటి దృశ్యాలు పుట్టినప్పటి నుంచీ చూస్తున్నవే కాబట్టి అంతగా ఆశ్చర్యపోడు రాజా. పైగా, తండ్రి ఇంట్లో ఉన్నాడు అంటే, ఇంట్లో ఉండటానికి కూడా ధైర్యం చాలేది కాదు.

'తండ్రి ఇంట్లోంచి ఎప్పుడు బయటకు వెళతాడా? ఇంట్లో చెలరేగిన ఈ తుఫాను ఎప్పుడు తగ్గుతుందా?' అని ఆలోచించుకుంటూ తండ్రికి కనిపించకుండా ఓ మూలలో కూర్చునే వాడు.

''అమ్మా!'' వంటింట్లోకి వచ్చి మెల్లిగా పిలిచాడు రాజా.

బొమ్మలా నిలబడిపోయిన ఇందిరలో రాజా పిలుపుతో చలనం వచ్చింది.

''ఇదుగో, రాజా, క్షణంలో ఇచ్చేస్తాను నీ టిఫిన్'' అని గబగబా సర్ది ఇచ్చేసింది.

తల్లి అంటే ఏనాడూ జాలితప్ప భయం లేదు రాజాకు.

అస్తమానం దెబ్బలాడుకుంటూ, అన్యోన్యం లోపించిన తలిదండ్రుల మధ్య పెరిగే పిల్లల మనస్తత్వాలు ఎలా ఉంటాయో ఊహించగలదు ఇందిర.

తనకోసం కాకపోయినా పిల్లవాడికోసం పడి ఉన్నట్లు నటించడానికి తనకు ఇష్టమే. అయినా, అటువైపునుంచి ఏ విధమైన సహకారం లభించేది కాదు.

* * *

మధ్యాహ్నం ఇంటికి వస్తూనే రాజాకు అన్నం పెట్టి, తనూ తిని వంటిల్లు సర్ది ఇవతలి గదిలోకి వచ్చింది ఇందిర.

బయటి వైపు గదిలో నుండి చాలా తగ్గు స్థాయిలో మాటలు వినిపిస్తున్నాయి.

'ఎవరయి ఉంటారా?' అని తొంగి చూసింది ఇందిర.

రాజా, రాజా క్లాస్‌మేట్ వాసు. ఏదో మాట్లాడుకుంటున్నారు.

కొద్దిసేపు అలాగే నిలుచున్న ఇందిరకు వాళ్ల మాటలు వినిపించాయి.

''ఫరవాలేదులేరా, వాసూ! మీ అమ్మా, నాన్నా అటువైపు ఏమైనా వచ్చి చూస్తారా?''

''లేదురా, రాజా! ఒక వేళ ఇంట్లో తెలిస్తే అమ్మ నాన్నతో చెపుతుంది నాన్న చచ్చేట్లు తన్నుతాడు. నాకు భయం. పైగా, నా దగ్గర డబ్బు కూడా లేదు.''

''ఫరవాలేదు. నా దగ్గరుందిలే.''

''మీ అమ్మ ఇచ్చిందా?''

నవ్వాడు రాజా — ''అమ్మ ఇవ్వాలి టోయ్?'' అంటూ.

వింటున్న ఇందిరకు మతి పోయింది.

''మీ అమ్మకు తెలిస్తే మరి మీ నాన్నకు చెప్పదూ?'' భయంగా కళ్లు తిప్పాడు వాసు.

మళ్లీ నవ్వాడు రాజా.

''మా నాన్నకా? ఒకవేళ అమ్మ చెప్పినా నాన్న వినిపించుకోడు. వినిపించుకున్నా—'పోనీలే, చిన్న వెధవ! దేనికి కావలసివచ్చిందో? ను వ్యక్తిపోతే అంతకంటే ఏం చేస్తాడు?'అనేస్తాడు.''

మళ్లీ నవ్వాడు రాజా.

ప్రాణం పోయినంత పనయింది ఇందిరకు.

'ఇలాంటి కొడుకు కోసమా ఇన్నాళ్లూ తను పరితపించింది?' గ్రుస



కళ్లలో నీళ్లు తిరిగాయి.

గుండెల్లో ఏమిటో బాధ రేగింది.

అలాగే కూర్చుండి పోయింది ఇందిర

మళ్లీ రాజు బయటనుండే — "స్కూలుకు వెళుతున్నా నమ్మా!" అని కేక పెట్టే వరకు అలాగే ఉండి పోయింది.

'స్కూలుకే వెళుతున్నాడో, షికారుకే పోతున్నాడో?!'

ఇన్నాళ్ల వరకు ఇందిర అన్ని నమ్మకా లకూ ఆటపట్టు రాజు. ఆ క్షణంలో ఆ భావం తుడిచిపెట్టుకుపోయింది

చిన్నగా నిట్టూర్చి, తలుపు గొళ్లెం పెట్టి పైకి వెళ్లింది.

ఏం చెయ్యకుండా ఆలోచిస్తూ అలాగే కూర్చుంటే ఓ గంటలో పిచ్చి పట్టిపోతుంది. ఏదైనా పని చేద్దా మంటే ఓపిక లేదు. ఉన్న ఓపికంతా రాజు మాటలతో హరించుకుపోయింది.

'ఇప్పు డేం చెయ్యాలి? ... రాజును తన ఆశయాలకు అనుగుణంగా మార్చు కోలేదా? ... రాజు ఇలాగే మారిపోతాడా? ... ఏం చెయ్యాలి? . ఏం చెయ్యాలి?' అనే ఆలోచనలే.

తల విదిలించుకుంది ఇందిర అసహ నంగా.

ఎదురుగా ఉన్న టేబుల్ మీద దొంతర్లు దొంతర్లుగా కాగితాలు పేర్చబడి ఉన్నాయి.

అవన్నీ తెల్లకాగితాలు కావు.

నారాయణరావు ప్రఖ్యాత రచయిత. సంఘాన్ని సంస్కరించే ఆదర్శభావాలు గల రచయిత. పేరుపొందిన పాఠకుల అభిమాన రచయిత. తన రచనల్లో [illegible]కు తానే సంఘంలో ఎదురయ్యే ఎన్నో సమస్యల్ని సృష్టిస్తాడు. వాటికి పరిష్కార మార్గాలు కూడా చాలా చాకచక్యంగా చూపిస్తాడు. ముఖ్యంగా స్త్రీల కోసం పాటుపడే అభ్యుదయవాది.

చిన్నగా నవ్వుకొని ఒక్కొక్క కథే తీసి చూడసాగింది. ఓ కథను చూసి అప్రయత్నంగానే చేతిలోకి తీసుకుంది. కథ పేరు 'విడగని పువ్వు'.

చదువుతూపోతున్న ఇందిర కళ్ళు చటుక్కున ఆగిపోయాయి.

నాలుగే నాలుగు పంక్తులు.

"ప్రతి ఇల్లూ ఓ అందమైన తోట. అందులో ఉద్భవించే పిల్లలు మొక్కలైతే, తలిదండ్రులు ఇద్దరూ—ఇద్దరు తోటమాలులు. పిల్లలు మొక్కలైతే వాళ్ళ మనస్సుల్లో రేగే అతి సున్నితమైన భావాలు అతి సుకుమారమైన పుష్పాలు. 'తోటమాలు'లు ఇద్దరూ ఆ 'పుష్పాల్ని' ఎంతో జాగ్రత్తగా వికసింప జేసినవాడే ఆ 'మొక్క' మరింత అందంగా రాణిస్తుంది."

ఆ నాలుగు పంక్తుల్ని పది సార్లు చదివి నిట్టూర్చింది ఇందిర.

'ఇంతటి సత్యాన్ని రచనల ద్వారా లోకానికి అందిస్తున్న ఈయన, ఇంట్లో జరుగుతున్న విషయాల్ని పట్టించుకోరేం?' జవాబు రాని ప్రశ్నను తనకు తానే ప్రశ్నించుకుంది.

ఇంకో కథ 'పతిత'. ఆ కథకు ప్రైజ్ కూడా వచ్చింది. తెలిసీ తెలియని వయసులో కాలుజారిన ఓ అమాయిక స్త్రీ గాథ. కథలో ఆ స్త్రీకి అంత ఉన్నతమైన స్థానాన్ని కల్పించి, పాఠకుల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేటట్లు చేసిన ఈయన, నిజ జీవితంలో... తను తాళికట్టిన భార్య చేసిన చిన్న తప్పును క్షమించలేక పోతున్నారే?! అసలు తను చేసిన తప్పేమిటి?

తను భూమిమీద పుట్టిన మరుక్షణమే అంతకుముందే పుట్టిన బావ శేఖరానికి భార్య అయిపోయింది.

పిలవడమే "శేఖరం భార్య పుట్టింది" అన్నారు.

తను పుట్టినప్పుడు ఆ శేఖరం బావ చూశాడో, లేదో కాని, తనకు జ్ఞానం వచ్చే వయసునుండి తను శేఖరం బావకు భార్య కాబోతుందని తెలుసు. అంతేకాని, నిజానికి ఆ శేఖరం బావ రూపురేఖలు ఎలా ఉన్నాయో చూడనే లేదు. చివరికి ఓ శుభముహూర్తాన వీలు చేసుకొని ఆ శేఖరం బావ అమ్మగారు—"మాకు కావలసినంత కట్నం మీ రిచ్చుకోలేరు. అమ్మాయికి ఇంకో సంబంధం చూసుకోవచ్చు" అని వ్రాసినప్పుడుకూడా తను పెద్దగా బాధపడినదేమీ లేదు. తెలిసో తెలియకో శేఖరం బావ అంటే ఓ విధమైన ముద్ర పడిపోయింది మనసులో. ఆ తరవాత పెళ్లి అయీ కాకముందే ఆ భావం చెరిగిపోయింది కూడా. అంతేకాని, అంతకుమించి మరేమీ జరగలేదే తనను ఆయన అంతగా అనుమానించడానికి, అసహ్యించుకోవడానికీను?

పూర్తిగా కాలుజారిన ఓ పతితకు తన కలం ద్వారా సంఘంలోనే ఓ విన్నవాన్ని లేవదీసి స్థానం కల్పించిన రచయిత, తెలిసీ తెలియని వయసులో రూపురేఖలు తెలియని ఓ వ్యక్తిని అభిమానించిన కారణంగా తనను వెలివేస్తున్నాడని పాఠకలోకానికి తెలిస్తే నమ్మగలరా? ... హాఁ...ఏనాటికీ నమ్మలేరేమో?

"అసలు స్త్రీ లేనిదే సృష్టిలేదు. కాబట్టే ఈ రచయితలూ, కవికుమారులూ అందరూ స్త్రీ చుట్టూ అందమైన పూలతీగె అల్లుతారు. సమాజంలో సమయానుకూలంగా ఆ పూలతీగెలనే ఉక్కుతీగెలుగానో, పట్టుదారాలుగానో మారుస్తారు."

ఎక్కడో చదివినది జ్ఞాపకం వచ్చింది.

'నిజం. అబద్ధమేం కాదు. ప్చ్!' అనుకుంది.

అలా ఆలోచిస్తూ ఎంతసేపు పడుకుందో తెలియలేదు. క్రిందనుండి తలుపు చప్పుడైతే గబగబా కాగితాలు సర్దేసి, క్రిందికి వెళ్లి తలుపు తెరిచింది ఇందిర.

ఎదురుగా నారాయణ.

ఇందిరను చూడగానే ముఖం చిట్లించుకున్నాడు.

"గంటసేపటినుండి గొంతు చించుకుంటూంటే తలుపులు తెరవకుండా మహారాణీగారు ఏ లోకాల్లో విహరిస్తున్నారు?" వ్యంగ్యంగా నవ్వాడు.

నారాయణ ఇందిరను కొట్టినా, తిట్టినా భరించగలదుకానీ ... కానీ, వ్యంగ్యంగా నవ్వే ఆ నవ్వునే భరించలేదు. చూస్తుంటే ఏమిటో ప్రాణం పోయినట్లుంది.

**ప్రతి ఇల్లూ ఒక అందమైన తోట. అందులో ఉద్భవించే పిలలు మొక్కలైతే తలిదండ్రులు ఇద్దరూ — ఇద్దరు తోటమాలులు. ఆ పిల్లల భావాలు అతిసుకుమారమైన పుష్పాలు. తోటమాలులు ఇద్దరూ ఆ పుష్పాల్ని ఎంతో జాగ్రత్తగా వికసింపజేసినవాడే ఆ మొక్కలు మరింత అందంగా రాణిస్తాయి. తోటమాలులు కలహించుకుంటూ ఉంటే?**

నారాయణ పైకి వెళ్లిపోయాడు.

టిఫిన్ ప్లేటు, కాఫీ కప్పు పైకి తీసుకెళ్లింది ఇందిర.

"అక్కడ పెట్టి వెళ్లు." ఏదో వ్రాసుకుంటూ తలయినా ఎత్తకుండా ఆజ్ఞాపించాడు నారాయణ.

భర్తవైపు జాలిగా చూసింది ఇందిర.

నారాయణ ఓ క్షణం కళ్లెత్తి ఇందిర కళ్లలోకి చూసి ఉంటే ఆ కళ్లలో ప్రతిబింబించే భావాల్ని పేజీలకు పేజీలే వ్రాసేసి ఉండేవాడేమో కానీ, చూడలేదు.

రచయితలు నిజజీవితంలో జరిగే సంఘటనల్ని తమ కళ్లతో చూసి ఏ నాటికీ భరించలేరు. మనో ఫలకంమీదే తమంతకు తామే సృష్టించుకున్న సంఘటనల్ని అందంగా చూసి, వాటిని రచిస్తారు.

"అక్కడ పెట్టి వెళ్లు." మళ్లీ చెప్పాడు నారాయణ.

టేబిల్ మీద పెట్టేసి వెనక్కి తిరిగి వచ్చేసింది ఇందిర.

రాజా గురించి తల్లిగా వాడి భవిష్యత్తు కోసం భర్త ముందు ఏదేదో మాట్లాడాలనుకుంది. కాని, పెదవి దాటి ఒక్క మాటా రాలేకపోయింది.

చిన్నగా నిట్టూర్చి, మెట్లు దిగి క్రిందికి వచ్చేసింది.

అయిదున్నర అయింది ... ఆరయిపోయింది.

రాజా రాలేదు.

కనుచీకట్లో గుమ్మం ముందు నిలుచుని బయటకు చూడసాగింది ఇందిర.

చిక్కగా చీకటి కమ్ముకున్నా రాజా రాలేదు.

భయం వేసింది ఇందిరకు.

పెళ్లయిన ఆరు నెలలకే నారాయణకు దూరమైపోయింది.

వెలిసిపోయిన జీవితంలో రాజా పుట్టబోతున్నాడని తెలిసి ఎంత సంతోషపడిపోయిందో తను!

పసితనంనుంచి తాను రాజాను నారాయణలా కాకుండా నిజమైన ఆదర్శపురుషుడుగా, ఉన్నతమైన భావాలు కల వ్యక్తిగా రూపొందించాలనుకుంది. ఈ నాటికి తను కన్న కలలన్నీ కల్లలైపోయాయి...మరీ ఆలోచించలేకపోయింది ఇందిర!

టైమ్ ఏడున్నర. రాజా ఇంకా రాలేదు.

మెల్లిగా పైకి వెళ్లింది ఇందిర.

కనుబొమలు రుద్దుకొంటూ, దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు నారాయణ.

'మరీ ఏదైనా కొత్త సమస్య గల కథకు ప్లాట్ ఆలోచిస్తున్నారేమో?' అంత ఇదిలోనూ నవ్వుకుంది ఇందిర.

అలా ఆలోచనల్లో ఉన్నప్పుడు పలకరిస్తే నారాయణ ఎంతగా విసుక్కుంటాడో తెలిసికూడా పిలిచింది.

విసుక్కుంటూనే, "ఏం?" అన్నాడు నారాయణ.

"రాజా ఇంకా రాలేదు."

"ఎక్కడికి వెళతాడు? వస్తాడులే. ఏ ఫ్రెండ్స్‌తోనో ఆడుకోవడానికి వెళ్లి ఉంటాడు."

"ఏడున్నర అయిపోయింది."

"ఆటల్లో ఆలస్యం అయిపోయి ఉంటుందిలే."

ఇక భరించలేకపోయింది ఇందిర.

"రాజా ఈమధ్య చెడిపోతున్నాడు. మీరు కాస్త భయపెట్టాలి. ఇలాగే విడిచిపెట్టేస్తే మరీ భయంలేకుండా పోతుంది" అంది.

వ్రాస్తున్న వాడల్లా చటుక్కున ఆపి, గట్టిగా నవ్వాడు నారాయణ.

"మా అమ్మ నన్ను చిన్నప్పుడు, 'నారాయణ చాలా మంచి వాడు' అనేది. ఇప్పుడు నువ్వు నన్ను చెడ్డవాడు అనటం లేదూ? ... అలా అని చెప్పకపోయినా నాకు తెలుసులే. అలాగే నువ్విప్పుడు రాజాను చెడ్డవాడంటున్నావు. రేపు వాడి భార్య వాణ్ణే మంచివాడనవచ్చు. ఎవరికి తెలుసు?" మరీ నవ్వాడు నారాయణ.

నోట మాట రాలేదు ఇందిరకు.

"అది కాదు. రాజా ... రాజా చెడిపోతున్నాడు" అంది ఇంకెలా చెప్పాలో తెలియక.

"ప్చ్! వాడు చెడిపోతుంటే నేనేం చెయ్యగలను? కన్నతల్లివి — నువ్వు చూసుకోవాలి ఆ విషయం. అయినా, బాగుపడేవాళ్ళని మరెవరూ చెరపలేరు. చెడిపోయేవాడిని మరింకెవరూ బాగు చెయ్యలేరు." అదో రకంగా చెప్పేసి మరీ వ్రాసుకోసాగాడు నారాయణ.

కన్నకొడుకు విషయంలో నారాయణ ప్రవర్తనను మూర్ఖత్వ మనాలో, నిర్లక్ష్యం అనాలో, నిర్లిప్తత అనాలో? —ఏం తోచలేదు.

"నిజమే. మీరు చెప్పిన ఆ మాటలు మూర్ఖుల విషయంలో కాని, మైనపు ముద్దల్లాంటి పసివాళ్ల విషయాల్లో మాత్రం కాదు." విసురుగా చెప్పేసి క్రిందికి వచ్చేసింది ఇందిర.

తలుపు తెరిచేసరికి రాజా నిలుచుని ఉన్నాడు.

"ఇంత ఆలస్యం అయిపోయిందేం, రాజా?" ఏమీ తెలియని విధంగా అడిగింది ఇందిర.

"ఈ రోజు మాస్టారుగారు ఎక్స్‌కర్షన్‌కని అలా తీసుకువెళ్లా రమ్మా.

అందుకోవమే ఆలస్యం అయిపోయింది." ఏమాత్రం తడుముకోకుండా చెప్పేశాడు రాజా.

మరుక్షణమే రాజా చెంప చెళ్లు మంది.

నవ్వుకుంటూనైనా బుగ్గని కాస్త గట్టిగా గిల్లని తల్లి, ఒక్కసారిగా కళ్లు తిరిగిపోయేటట్లు అంత పెద్ద దెబ్బ కొట్టేసరికి ఆశ్చర్యపోయి, తల్లినే చిత్రంగా చూస్తూ ఉండిపోయాడు.

ఓ పది క్షణాల తరవాత కొట్టిన దెబ్బ తాలూకు బాధ మొదలయ్యేసరికి కళ్లలో నీళ్లు తిరిగాయి.

రాజా కళ్లలో నీటిని చూడలేక చటుక్కున మొహం తిప్పేసుకుని లోపలికి వెళ్లిపోయింది ఇందిర.

ఆ రోజు రాత్రి రాజాకు అన్నం పెట్టలేదు. వాడితో సరి మాట్లాడలేదు.

మెల్లిగా వెక్కుతూనే నిద్రపోయాడు రాజా.

అమాయికంగా నిద్రపోతున్న రాజానే చూస్తూ అలాగే కూర్చుంది ఇందిర.

ఎంత ఆలోచించినా వాడిదేం తప్పుగా కనిపించలేదు. తప్పంతా తనదీ, నారాయణదీనూ.

ఆలోచిస్తూ రాజా పక్కలో అల్లాగే పడుకుంది.

• • •

మరునటి రోజు ప్రొద్దున్నే వాళ్లిద్దరూ బయటికి వెళ్లిపోగానే ఆలోచిస్తూ కూర్చుంది ఇందిర.

'రాజాను బాగు చేసుకోలేదా తను?'

ఏం తోచలేదు ఇంట్లో. చెప్పులు వేసుకొని రాజా స్కూలు వైపు వెళ్లింది.

రాజా స్కూలు బయటి నుండి కూడా అందంగా కనిపిస్తుంది. క్లాసులు నిశ్శబ్దంగా జరిగిపోతున్నాయి. విజిటర్స్ రూమ్‌లోకి వెళ్లి కూర్చుంది కొద్దిసేపు.

గోడమీద ఓ వైపు బోసినవ్వులు చిలికే గాంధీ తాత. క్రింద అక్షరాలలో "ఏ ఉన్నత పాఠశాలా ఓ ఆదర్శ గృహానికి సరిరాదు" అని ఉంది.

రెండో వైపు గాంధీ తాత, చాచా నెహ్రూ — ఇద్దరూ నవ్వులు చిలకరిస్తున్నారు.

క్రింద "ప్రతి ఇల్లూ ఓ విశ్వవిద్యాలయమైతే, తలిదండ్రులు ఉపాధ్యాయులు" అని ఉంది.

ఇందిర మనసులో మరీ అలజడి ప్రారంభమైంది.

'తనది ఆదర్శమైన గృహమా?' తనకు తానే ప్రశ్నించుకుంది.

మనసుకు ఎంత నచ్చచెప్పు కుందామన్నా తనది ఆదర్శ గృహంగా అనిపించ లేదు.

'కాకపోతే ఇంత మంచి స్కూల్లో చదివే రాజా అటువంటి ప్రవర్తన నేర్చుకుంటున్నాడంటే లోపం తన ఇంట్లో సరిఅయిన శిక్షణ లేక కదా? నిజం? తనది ఆదర్శ గృహం కాదు.'

కళ్లు తిరిగిన ట్లనిపించింది.

భుజాల చుట్టూ కొంగు చుట్టుకొని ఇంటికి బయలుదేరింది ఇందిర.

ప్రొద్దుటినుండీ అన్నం తిననందువల్లో, లేక ఎక్కువ ఆలోచనలు చేసినందువల్లో మరీ నీరసమనిపించసాగింది. వస్తూనే మంచంమీద సొమ్మసిల్లి పడిపోయింది.

ఆలోచనల నుండి ఎంత తప్పించుకుందామన్నా కళ్లముందు "డబ్బు అమ్మ ఇవ్వాలిటోయ్, నానా?" అని మెల్లిగా అంటున్న రాజే కదలాడసాగాడు.

'ఇది ఇలాగే సాగితే భవిష్యత్తులో రాజా ఏమవుతాడు? ... దొంగనా?...' కళ్లముందు బేడీలతో రాజా కనిపించాడు.

కెవ్వున కేకవెయ్యా లనిపించింది. ఒళ్లంతా చెమటలు పట్టిపోయాయి.

'ఉహూఁ, ఏమైనా ... ఏమైనాసరే, రాజా మంచివాడు కావాలి.' తనలో తనే అనుకుంది.

లేచి వెళ్లి ముఖం కడుక్కుంది.

కాఫీ తయారుచేసుకొని స్థిమితంగా ఓ చోట కూర్చొని త్రాగింది. ఓ నిర్ణయానికి వచ్చేసినందువల్లనేమో హృదయ భారం తగ్గి తేలిగ్గా ఉన్నట్లనిపించింది.

* * *

మరునటి రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన నారాయణకు టేబుల్ మీద చిన్న కాగితం కనిపించింది.

"శ్రీవారికి,


ఇద్దరు తోటమాలులలో అస్తమానం ఒకరు పీకి పడేస్తుంటే, ఇంకొకరు ఎంత జాగ్రత్త తీసుకొని, ఎన్ని ఎరువులు వేసినా ఆ మొక్క ఏనాటికీ ఆరోగ్యంగా పెరగదు. ఆరోగ్యంగా పెరిగి, అందమైన పువ్వులు పూయడానికి సక్రమమైన పద్ధతిలో పెంచే ఒక్క తోటమాలి అయినా చాలు.

అర్థం చేసుకున్నా రనుకుంటాను.

మీ
—ఇందిర." ★

ఎన్నైళ్లైతే చాలును?
ఫోటో—వై. ప్రభావతి (మద్రాసు—53)






చిత్రం—జి వి. శివన్నారాయణ (గంగవరం)